# ప థ వి హీ న

# పథవిహీన

అదొక ఊరు!

ఊరికి మధ్యలో నిత్యమూ సువాసనలు గుబాళింప చేసే మురికికాలవ!!

కాలవకు ఎడమవైపు కూలీనాలీ చేసుకుంటూ కాయ కష్టం చేసుకు బ్రతికే మనుష్యుల తాటాకు గుడిశలు...

ఆ గుడిశల్లో మనుష్యులకు ఖరీదైన ఆశల్లేవు. తియ్యటి ఆనందం తెలీదు. మరలాంటి బ్రతుకు వాళ్ళది.

అక్కడుండే గుడిశల చుట్టూ మురికి చెత్త గుట్టలు స్వర్ణయుగంనాటి ధనరాసుల్లాగా యెత్తుగావుండి ఆకాశంలోకి చొచ్చుకు పోవాలని ప్రయత్నిస్తూ వుంటయ్. పురపాలక సంఘంవారి 'ఆరోగ్యమే మహా భాగ్యం - మురికియే వ్యాధులకు కారణం' అనే స్లోగన్‌కి విరుద్ధంగా స్వైరవిహారం చేస్తూంటాయ్ ఈగలు.

చెత్తగుండీల మీద సైనికదళాల్లాగా వేల సంఖ్యలో దోమలుచేరి 'గీ' పెడుతూ వుంటయ్. కుళ్ళిపోయిన మట్టిని తవ్వుతూ ఏదో బావుకు తినాలనే పందులు, చచ్చిపోయి దుర్గంధాన్ని వెదజల్లుతూ మెండిపోబోతున్న జంతువులను పీక్కుతింటూ, అప్పుడప్పుడు కొట్లాడుకుంటూ...మనుష్యుల్లోనే కాదూ మాలో కూడా సఖ్యంలేదనే నిజాన్ని నిరూపించే కుక్కలు...అదీ అక్కడి వాతావరణం!

నిత్యం దరిద్రం తాండంచేసే చోటది!!

గుడిశల్లోని ఒక జీర్ణించిపోయిన గుడిశలో పచ్చని కాపురం చేయలేని మనిషి!

బిక్కచచ్చిపోయిన ఆశలతో బ్రతికే ఆడది! పేరు లచ్చి!

లచ్చి వంటరిది!...

అందమైనది లచ్చి! వయసులోవున్న లచ్చికి సౌభాగ్యం లేకపోయినందుకు బ్రతికినన్నాళ్ళు కుళ్ళి కుళ్ళి యేడవకుండా చూచుకుని మురిసి పోయేందుకు ఒక్కగా నొక్క కొడుకు! పేరు రామిగాడు.

రామిగాడు లచ్చికి రెండో ప్రాణం! మొగుడు పోవటంతో లచ్చిలో మొదటి ప్రాణం రివ్వున యెగిరిపోయింది.

నీడ దూరమైంది!-

లచ్చి బ్రతుకు బజారుపాలైంది-

మొగుడు చాటున చల్లగా బ్రతికే లచ్చి... కల్లో గంజో కళ్ళు మూసుకుతాగే లచ్చి...ఒంటరిదైంది.

పొట్ట పోసుకుందుకు లచ్చి ఏదో పన్లో చేరక తప్ప లేదు.

పొగాకు కంపెనీలో రోజు కూలికి చేరింది. పన్లోచేరి నెలతిరక్కముందే పొగాకు వాసనగిట్టక వళ్ళు సుస్తీ చేయ టంతో మానేసింది పని.

లచ్చి వొంటరి జీవితంలోకి ఎన్నో నీడలు చొచ్చుకు జొరబడాలని ప్రయత్నించాయి.

నిజాయితీ మనిషి లచ్చి! -

చచ్చిచాసరే ఆత్మను చంపుకుందుకు ఇష్టపడ్లేదు.

కానీ, లచ్చి ఆడది!-పైపెచ్చు వుడుకునెత్తురు ప్రవ హించే వయసు! కోరికలు తీరకముందే ఒంటరిదయిన అభా గిని!-

రేసు గుర్రాల్లాగా పరుగులుతీసే కోరికలను మనసు లోనే అణుచుకుంది.

కానీ...సమాజం కళ్ళల్లో నిప్పులు పోసుకుంది. నోరు పారేసుకుంది.

అన్నీ సహించింది లచ్చి! ఓర్పుతో నేర్పుగా బ్రతుకు తోంది.

ఏ పని చేద్దామన్నా లచ్చికి పరువంపొంగే వయసు అడ్డుగా నిలవటంతో...ఆమె ఓటమిని అంగీకరించక తప్ప దేమోనని భయపడసాగింది.

ఎన్నో విధాలుగా కష్టపడి బ్రతకాలని ప్రయత్నంచేసి చివరికి నలుగురిళ్ళల్లో పాచిపనిచేసి బ్రతుకుతోంది.

* * *

మూసినకన్ను తెరవకుండా జ్వరంతో నాల్గుగు రోజులుగా మంచానికి అంటిపెట్టుకొని పడివుంది లచ్చి!

ఇరుగు పొరుగు వాళ్ళెవ్వరూవచ్చి లచ్చిని పలుకరించి పరామర్శించిన పాపాన పోలేదు.

చాతై చాతకాకుండా రామిగాడు పొయ్యి రాజేసుకుని నూకగంజి కాచుకుని తాగుతున్నాడు.

"అమ్మోయ్!... శేతిరికి నూకల్లేయే..." కళ్ళు రెండూ మూసుకొని కుక్కి నులక మంచంలో పడుకున్న తల్లితో అన్నాడు రామిగాడు ఇనుప గొట్టంతో పొయ్యి వూదుతున్న వాడల్లా ఆపి.

కొడుకు పిలుపుకు కళ్ళు తెరిచిన లచ్చి "అయిగాసిని అయిపోయినయ్యొట్రా...ఊం..." అనేసి మొండిపోయిన పెదాలను నాలికతో తడిచేసుకుని "అరేయ్...సూడూ... అయ్యగారింటికెళ్ళి...జీతం డబ్బులిప్పించుకురా..."అన్నది మళ్ళీ.

రాజుకున్న పొయ్యిమీద నీళ్ళకుండ పడేసి రామిగాడు రోడ్డెక్కాడు.

రోడ్డుకు అడ్డంగావున్న గులకరాళ్ళను కాలితో తన్నుకుంటూ, జారిపోతున్న నిక్కరు పైకి మెగబీక్కుంటూ గబగబా నడుస్తున్నాడు రామిగాడు.

బుర్రమీసాల ముసలాయన వాకిటికి అడ్డంగా యమధర్మరాజులా నిల్చుని "మీ అమ్మేదిరా..." గదమాయించాడు రామిగాడిని చూచి.

"మా యమ్మకే..."

"ఏ మొచ్చిందిరా వెధవా!..." పిడుగు పడ్డట్టు అరిచాడు.

"జొరమొచ్చింది అయ్యగోరూ..." బిక్క మొహం వేసి నిల్చున్నాడు.

"వయసులో వుందిగదాని విర్రవీగితే జ్వరం రాకేమవుతుంది?...దొంగముండ! జ్వరంలేదూ గిరంలేదూ, పని యెగవేసేందుకు అన్నీ వేషాలు!! అయినా...ఏనాడు నెలకు ముప్ఫై రోజులూ పన్లో కొచ్చిందిగనుక..."

"అదిగాదయ్యగోరూ..."

"నోర్మూయ్యరా గాడిద కొడకా! ఈ విషయం చెప్పటానికా నువ్వు ఘోరించింది." అనేసి ఇంట్లో కెళ్ళబోయాడు.

"అయ్యా..." సౌమ్యంగా పిలిచాడు రామిగాడు.

"ఆఁ...యేం? చావుకబురు చల్లగా చెప్పావుగా ఇహ దయచెయ్. ఇంకా యెందుకూ నిలువుకాళ్ళ వుద్యోగం."

"మా యమ్మ డబ్బులు తీసుకురమ్మన్నాది..."

"ఇంకేం! మా దొడ్లో కుప్పలు పోసివున్నయ్! సంచీ తెచ్చుకోపోయావా ఏరుకుపోయేవాడివి..."

"శేతిరికింటో నూకల్లేవయ్యా..."

"మా ఇంట్లో పరవాన్నం ముందీ పట్టుకెళ్ళు. ఇదిగో చూడూ! పన్లోకి వచ్చేదాకా పైసా కూడా ఇవ్వనన్నానని మీ అమ్మతో చెప్పు. వెళ్ళు...వెళ్లు..."

రామిగాడు బిక్కచచ్చిపోయి కాళ్ళీడ్చుకుంటూ గుడిశ చేరేడు.

"ఏరా... పెద్దయ్యే మన్నడు..." కొడుకు లోపలికి రావటం చూచి అడిగింది లచ్చి.

"నోటికొచ్చినట్టు తిట్టేడు, డబ్బులియ్యను పొమ్మన్నాడు..."

రామిగాడి సమాధానం లచ్చిని మరింత బలహీనపర్చింది.

"అట్టనా...అదిగాదురబ్బీ...సిన్నయ్య అగుపడ్లా"..." మళ్ళీ అడిగింది.

చిన్నయ్యగారు కనుక కన్పించివుంటే తప్పకుండా డబ్బులిచ్చి వుండేవాడని లచ్చి భావన...!

చిన్నయ్యగారి దృష్టిలో లచ్చి, నందనవనంలోవూచిన బంగారు సుమం!!

తప్పుచేయకూడ దనుకొంటూనే చిన్నయ్యగారి విషయంలో తప్పటడుగువేసినా...లచ్చికి తప్పనిపించలేదు.

జీవితపు సరదాలకు దగ్గరయింది.

సర్వం చిన్నయ్యగారికే అర్పించింది.

రామిగాడు అచ్చు చిన్నయ్యగారిపోలికేనని ఎప్పుడూ మురిసిపోతూంటుంది లచ్చి.

గూడెంలోవాళ్ళు తనను యెన్ని అన్నా సహిస్తోంది. కానీ...రామిగాడిమీద ఈగ వాలనీదు.

తనతో యెవ్వరూ మాట్లాడకుండా తనపై కత్తి కట్టినా బ్రతగ్గలననుకుంది. చిన్నయ్యగారి మంచితనంతో రామిగాడిని చూచుకు బ్రతుకుతోంది.

ఆలోచన్లనుండి తెప్పరిల్లిన లచ్చి "ఓరయ్యా, ఈదిలో కెళ్ళి...రత్తమ్మను పిలుసుకు రారా..." అంది.

గుంజ కానుకొని కూర్చున్న రామిగాడు గుడిశలోంచి లేచి బైటికెళ్ళాడు రత్తమ్మకోసం.

లచ్చికి నాలుక పిడచగట్టుకుపోతోంది. జ్వరంతో వళ్ళు మాడిపోతోంది. మాట్లాడగల సత్తువకూడా లేని పిలో సన్నగిల్లుతోంది.

కళ్ళు మూసుకుని మంచానికి అంటిపెట్టుకుని పడుకోవటం తప్ప ఏ మందూ మాకూ తీసుకోనైనా లేదు.

ఒంట్లో ఓపికవుండీ, తను తిరిగి సంపాదించినన్నాళ్ళూ కష్టమన్పించలేదు. అప్పుడు తనకు యెవ్వరి సాయమూ అక్కర్లేకపోయింది. తనను చూచి గూడెంలో వాళ్ళు ఓర్వ లేక కళ్ళల్లో నిప్పులు పోసుకున్నా... యెన్నో రకాలుగా అక్కసు వెళ్ళబోసుకున్నా తనకు బాగానే జరిగింది. ఎవ్వరినీ పైసా అడగాల్సిన అవసరం లేకపోయింది.

కానీ...ఇప్పుడు...తను మంచానికి అంటుకుని రోగంతో పడివుంది. జ్వరంతో బాధపడుతోంది. రెక్కాడితే గాని...డొక్కాడని బ్రతుకు తనది.

తను బ్రతికినా, చచ్చినా తనకు బాధలేదు. తిన్నా తినకపోయినా దిగుల్లేదు.

కానీ...మరి...రామిగాడు? వాడెట్లా బ్రతుకుతాడు? వాడికి కూడెవరు పెడతారు? తాను కాస్తా పోతే చిన్నయ్యా గారుకూడా చిన్నచూపు చూస్తే...రామిగాడి గతేంగాను?

"ఏండే లచ్చీ...అబ్బిగాడితో కబురెట్టినావంట?"

అనేసి రత్తమ్మ కంఠం విన్పించేసరికి ఆలోచనల్లనుంచి తేరుకుంది లచ్చి.

"ఒసే...నీకు జరంగా వుందని ఇప్పుడంటే కబురెట్టేది? మనిషివి సగమై పొయ్యావుగందే? మందూ మాకూ ఏంటే దెట్టా?..తరమాసుపత్తిరి కెళ్ళకపొయ్యావంటే..." మళ్ళీ రత్తమ్మే అంది లచ్చి పడుకున్న మంచం దగ్గరకొస్తూ.

"అత్తమ్మ...నా మందుకేమొచ్చెగానీ...ఆడి ఆకలి సూడలేకుండున్నాను. నాకాడేమో డబ్బులైపోయాయి. రేతిరికింటో పిల్లగాడికి నూకలు గూడా లేవాయె..."

"ఓస్ అంతేగందా. ఆడిని మా ఇంటికాడికి రమ్మనే. ఆడే నాలుగు మెతుకులు గతుకుతాడు..." అనేసి మంచం దగ్గరే చతికిలబడ్డది.

"నువ్వీడొచ్చి కూకున్నావంటే...అయినా ఆ లంజదాంతో నీకేటి యవ్వారాలున్నాయి అంట? ఆ ముండ సెడిపోయిందిసాలక అందరినీ సెడపాలని సూత్తోంది. రామెహె రా..." ఒక్కదూకులో గుడిశలోకొచ్చిన నారయ్య రత్తమ్మ రెక్కట్టుకొని లాక్కెళ్ళబోయాడు.

"మావా...అత్తమ్మదేం తప్పులేదు. నేను కబురెట్టించినాను. కూంతంత సాయపడండి మామా...మంచంలో వుండాను..." నీరసించిన కంఠంతో ప్రాధేయపూర్వకంగా అడిగింది.

"నోరుముయ్యే! సచ్చినా నీబోటిదానికి సాయం సెయ్యరాదు - గూడెంలోవాళ్ళు నీ బతుకుసూసి వూత్తున్నారు. నీకేం సిగ్గా! ఎగ్గా! బతకనేరిసిందానివి! నీ యవ్వా

రాల కడ్డొత్తాడని మొగుడ్ని సాగనంపినవు. తైతక్కలాడినవు. వంటో రగతం సన్నబడ్డాదిగా...యిప్పుడు మా సాయం గావాలసొచ్చినాది. నీ సావు నువు సావే? మాకేటికి..." అనేసి రివ్వున రత్తాలుజుట్టుపట్టుకొని చరచరా లాక్కెళ్ళాడు.

రెండు చేతులూ కాళ్ళచుట్టూ పోనిచ్చి మోకాళ్ళ మీద గడ్డం మోపుచేసి తడిక తలుపుకు ఆనుకుని కూర్చున్న రామిగాడికి నారయ్య మాటల్లో భావం బోధపడ్లేదు.

"ఛీ!...ఏం ముడుసులు, ఎదవముడుసులు! ఆడగూతురు వంటరిదైతే నిత్తెమూ పొడుసుకు తింటారు. అందరిసేతా మాటలు బడుతూ ఇంకా బతక్కపోతేనేం?- నాకు సావైనా రాదు, నా మీద దేవుడికి దయనేదు"" లచ్చి గొణుక్కుంది. తనమీద తనకే అసహ్యమేసింది.

నారయ్య సూటీ పోటీ మాటలు వినేసరికి, వంట్లో నెత్తురు కవ్వంతో చిలికినట్టయింది లచ్చికి.

మనిషి నీరసించిపోయింది. ఏడుపొచ్చింది.

రామిగాడిని దగ్గరకు తీసుకుని బావురుమంది.

తను చావకూడదు. తను యెలాంటిదైనా రామిగాడి కోసం బ్రతకాలి! ఇన్నాళ్ళూ వాడికోసమే ఆశగా బ్రతుకుతోంది.

చిన్నయ్యగారిలా రామిగాడు గొప్పవాడవాలి అనుకొంది. అప్పుడు తన కష్టాలన్నీ మర్చిపోయి బ్రతకవచ్చు అన్పించింది.

తన బ్రతుకుచూచి అసహ్యించుకొంటూ ఈటెల్లాంటి మాటలతో రాబందుల్లా పొడిచే మనుష్యులనోళ్ళు మూతలు

పడతాయ్. తన వంటరితనాన్ని చూచి కాటేయాలనుకునే నాగుపాముల కోరలు పీకినట్టవుతయ్...అనుకుంటూ తనను తాను ఓదార్చుకొంది లచ్చి!

కటిక నేలమీద కాళ్ళు ముడుచుకుని, కళ్ళుమూసుకొని తలకింద యెడంచెయ్యి మోపుచేసి యెత్తుగా దిండులాగ పెట్టుకొని లచ్చి మంచానికి పక్కనే పడుకొన్నాడు రామిగాడు.

లచ్చి అలసిపోయి నిద్రపోతోంది. అప్పుడప్పుడు సన్నగా మూలుగుతోంది.

రామిగాడికి నిద్ర రావటంలేదు. కడుపులో ఆకలిబాధ యెక్కువవుతోంది.

పడుకున్న వాడల్లా ఎల్లికిలా తిరిగి అటూ, ఇటూ పొర్లేడు - లేచి కూర్చుని రెండు చేతివేళ్ళతో తలంతా బరుక్కున్నాడు.

గుడిశ పైకప్పు చిల్లుల్లోంచి ఆకాశం కన్పించింది-లేచి పక్క వుదుటున గుడిశ బైటికి పరుగెత్తాడు.

పరుగెత్తే రామిగాడిలో ఓపిక సన్నగిల్లటంతో మెల్లగా, నీరసంగా నడుస్తూ గూడెం దాటేడు.

పెద్దరోడ్డు కవతల ఇంటిముందు నిల్చున్నాడు. గేటు తోసుకొని లోపలికెళ్ళాడు రామిగాడు.

గదిలోంచి అప్పుడే బైటికొస్తున్న రామనాథం రామిగాడిని చూచి, "ఎవర్రా నువ్వు?" అడిగేడు.

రామనాథం నాటు వైద్యుడు. వయస్సు నలభై దాకా ఉంటుంది.

"మాయమ్మకు జొరంగుంది..." దిక్కులు చూస్తూ అన్నాడు.

"మరి...మీ అమ్మేది?..."

"ఇంటికాడ మంచంలో వున్నాది?...

"రిక్షాలో ఇక్కడకి తీసుకురాకపోయావా?" అనునయంగా అన్నాడు.

"నడవనేదయ్యా..."

ఒక్క క్షణం ఆలోచించిన రామనాథం "ఊఁ, డబ్బులు తెచ్చావా?..." అన్నాడు, పంచపాళీలో వున్న కుర్చీలో కూర్చుంటూ.

లేవన్నట్టు తల అడ్డగా ఆడించాడు రామిగాడు.

"డబ్బుల్లేందే మందెట్లావస్తుందిరా కుఱ్ఱవెధవా? వెళ్ళిపట్రా!"

"ఇంటికాడకొచ్చి మాయమ్మను సూడండయ్యగోరూ! మా యమ్మను బతికించడయ్యా!...మీరు నాకపోతే మా యమ్మ చచ్చిపోద్ది..." రామిగాడిలో దుఃఖం పెల్లుబికింది.

కుర్చీలో కూర్చున్న రామనాథం దగ్గరగావచ్చి కాళ్ళకు పెనవేసుకుపోయాడు రామిగాడు.

"సరేలే!...లే!...పోదాంపద..." అనేసి కూర్చున్నవాడల్లా లేచి ఇంట్లోకెళ్ళి ఏవో మందులు కోటుజేబులో వేసుకొని వీధిలోకి నడిచాడు రామిగాడితో.

రామిగాడు ముందు, రామనాథం వెనకాల నడుస్తున్నారు.

"ఇదేనయ్యా మా గుడిశ..." అనేసి సంతోషంతో

లోపలికొచ్చి "అమ్మోయ్...డాకటరుగేరిని తెచ్చానేయ్... లేయ్..." అంటూ తల్లిని తట్టి లేపాడు.

లచ్చి కళ్ళు తెరిచి చుట్టూ కలియచూసింది. నీరసంతో కళ్ళు బైర్లు కమ్మటంతో లచ్చి కళ్ళకు, వచ్చిన మనిషి యవరైందీ వివరంగా కన్పించలేదు.

రామనాథం, మంచందగ్గరగా వచ్చి నిల్చుని లచ్చిని తేరిపారచూచి "ఓసీ!...నువ్వా ఏం!!..."ఆశ్చర్య పోయాడు.

రామనాథం గొంతు గుర్తించలేక పోయింది లచ్చి. వచ్చినది చిన్నయ్యగారు మాత్రం కాదని రూఢి చేసుకొంది.

"అయ్యా! మాయమ్మ ఇదే!...మందియ్యండయ్యా!" జాలిగా అడిగేడు.

"ఓరికుంకా! నువ్వు దీని కొడుకువా?...ఏమే లచ్చీ! ఇన్నాల్టికి నా మందు కావలసి వచ్చిందన్నమాట. ఆనాడు నువ్వు నన్ను కాదన్నావ్...ఇప్పుడు నా మందుమాత్రం నీ కెట్లా పనిచేస్తుందీ..." దీర్ఘాలుతీస్తూ అన్నాడు.

కళ్ళు విప్పార్చుకు చూస్తూ మనిషెవర్రైందీ పోల్చుకో గలిగింది లచ్చి. గతం కళ్ళముందు తారాడింది...

రామనాథం ఆస్పత్రిలో తాను పాచిపని చేసేరోజుల్లో రామనాథం తనంటే మోజుపడ్డాడు. ఆడంటే తనుమండిపడ్డది, అసహ్యించుకుంది. రామనాథం కరుకు కబంధ హస్తాల్లోంచి మానాన్ని కాపాడుకొని యెలాగో బైటపడి పని మానేసింది.

అన్నీ గుర్తొచ్చాయి లచ్చికి.

"బాబుగోరూ...తవురు డాకటర్లు. దేవుడిలాంటివోరు, మేం సాకమడుసులం? మందిచ్చి పున్నెం కట్టుకోండి బాబూ!" గతాన్ని మర్చి ప్రాధేయపూర్వకంగా అర్థించింది.

"నన్ను కాదని...నీ చౌకతనాన్ని మరొకడి కెవరికో ఖరీదుకు అమ్ముకున్నావన్నమాట?" కటువుగా అని కసిగా నవ్వేడు రామనాథం.

"డాకలేరు బాబూ..." అభిమానంతో అంత నీరసంలోనూ పెద్దగానే అరిచింది లచ్చి.

"ఎందుకే అట్లా అరుస్తావ్..."

"సావుకాడున్నదాన్ని మాటలతో సంపకండి బాబూ! మందిచ్చి కూతంత పున్నెం కట్టుకోండయ్యా!..."

"మందా!... నువ్వు చచ్చినాసరే...నా చేతుల మీదుగా మందివ్వను. ఆనాడు నువ్వు నాకు చేసిన శాస్తి ఇంకా మర్చిపోలేదు. నువ్వెట్లాచస్తే నాకేం?...నీ చావు నువ్వు చావు..."అనేసి గబగబా బైటికెళ్ళిపోయాడు రామనాథం.

"దేవుడా! నాకెందుకీ జలమం. ఆనాడు ఆడితోపాటె నన్నూ తీసుకెళ్ళినా బాగుండేది. చీ! ఆడజలమం...జలమ జలమానికీ వొద్దు..." అనేసి మంచంకోటికి తల బాదుకొని వలవలా ఏడ్చింది.

చీకటి పడ్డది!

గుడిశలో కిరసనాయిలు బుడ్డి వెలిగించాడురామిగాడు.

గుడిశ తలుపు తోసుకుని రత్తాలు లోపలికొచ్చింది. కొంగు చాటున దాచి తెచ్చిన సత్తుగిన్నె రామిగాడి చేతికిచ్చింది.

గిన్నెలో పులుసన్నం చూచేసరికి రామిగాడి ప్రాణం లేచొచ్చింది.

"రత్తాలు బువ్వ తెచ్చిందేయ్..." ఆనందం పట్టలేక తల్లిదగ్గరకెళ్ళి చెప్పాడు.

లచ్చి రెప్పలు విచ్చుకున్నయ్. రత్తాలు కేసి చూచిన లచ్చి కళ్ళు కృతజ్ఞతతో చెమర్చినయి.

"మీ మావఁన్న మాటలకు బాధపడకే లచ్చీ! పిల్ల గాడి ఆకలిచూసి నా పేనం గిలగిలమన్నాది—ఆడింటికి రాక ముందే... ఈడికి కూతంత కూడు పట్టుకొచ్చినా..." అంది రత్తాలు.

గిన్నెలో పులుసన్నం గబగబా ఖాళీ చేసేసిన రామి గాడు గ్లాసెడు మంచినీళ్ళు త్రాగి 'బేవు' మని త్రేన్చేడు.

గిన్నె తీసుకుని వెళ్ళిపోయింది రత్తాలు.

ఆకలిమంట చల్లారేటప్పటికి వళ్ళు బరువెక్కి రామి గాడి కళ్ళు మూతలు పడ్డాయి.

నిద్రపోతున్న కొడుకుని చూచి తృప్తిగా నవ్వుకుంది లచ్చి.

అర్ధరాత్రి సమయం.

గుడిశ చిల్లుల్లోంచి 'టప...టప...' మంటూ చిను కులు నిద్రపోతున్న రామిగాడిమీద పడటంతో వులిక్కిపడి లేచాడు.

అక్కడక్కడ గుడిశంతా కురుస్తూనేవుంది.

బైట వురుములు... మెరువులు...

రామిగాడికి భయమేసింది.

మంచం దగ్గరగా వెళ్ళి "అమ్మోయ్... వానొత్తా వుందే..." అన్నాడు.

మూసుకున్న కళ్ళు తెరిచి చూచేస్థితిలో లేని లచ్చి "ఓరయ్యా... నాకాడ తొంగో..." అంది.

తల్లి పక్కనే ముడుచుకు పడుకున్నాడు.

తల్లి ముఖంమీద చెయ్యి వేశాడు. జ్వరంతో వళ్ళు సల సల కాగిపోతోంది. చల్లగాలికి వణుకు ప్రారంభ మైంది లచ్చిలో.

తెల్లవారేక కూడా వర్షం కుండపోతగా కురుస్తూనే వుంది.

కొన్ని గుడిశల్లోకి బాగా నీళ్ళు తోసుకొచ్చాయి. మట్టిగోడలు కొన్ని నేలకొరిగేయి. కొన్నిటికి పైకప్పు పూర్తిగా యెగిరిపోయింది. ఒకటి రెండు దయ్యాల్లాంటి వేపచెట్లు నేలమట్టమైనయ్.

లచ్చి గుడిశ కొంచెం మెరకలో వుండటంవల్ల కొంచెం నయమనిపించింది.

పొద్దెక్కినా తల్లి కళ్ళు తెరచి తనను పలుకరించకపోవ టంచూచి బెంబేలు పడిపోయాడు రామిగాడు.

తల్లిదగ్గరకెళ్ళి తట్టి లేపినా లేవలేదు. సన్నగా మూలుగు మాత్రం విన్పించింది.

రామిగాడికి భయమేసింది. బిక్కమొహం వేశాడు. ఏడుపొచ్చింది - ఏంచేయాలో తోచలేదు పదేళ్ళరామిగాడికి.

తల్లికి జబ్బేమిటో తెలీదు. వచ్చిన డాక్టరేమో మంది వ్వకుండానే వెళ్ళిపోయాడు. పెద్ద డాక్టరు దగ్గరకెళ్ళేందుకు డబ్బుల్లేవు.

తల్లిని బ్రతికించుకోవాలనే ఆదుర్దా రామిగాడి పసి హృదయంలో యెక్కువయింది.

కళ్ళు తుడుచుకుని గుడిశలోంచి గబగబా బైటి కొచ్చాడు. మోకాటిలోతు నీటిలో నడుస్తూ వర్షంలో తడుస్తూ రోడ్డెక్కాడు.

'అమ్మకు మందుకావాలి! అమ్మ బ్రతకాలి!!' ఇదే రామిగాడి ఆలోచన.

తెలిసీ తెలియని రామిగాడి మనసు తల్లిప్రాణంపట్ల గాబరాతో తల్లడిల్లిపోతోంది.

ఒక మందుల కొట్టుముందు ఆగేడు.

కొట్లో రకరకాల మందులు రామిగాడి కంటికి అగుపించాయి. అవన్నీ తీసుకెళ్ళి అమ్మ కియ్యాలి - అనుకున్నాడు. బతికించుకోవాలని ఆశపడ్డాడు.

కానీ...యెట్లా? ఏ మందు కావాలో తనకు తెలీదు.

అద్దాల బీరువాల్లో వున్న మందులకేసి ఆశగా చూస్తూండిపోయాడు.

పెద్ద చినుకు తగ్గినా వర్షం తుంపర్ల తుంపర్లగా పడుతూనే వుంది.

రామిగాడి చిరిగిన చొక్కా, మాసికవేసిన నిక్కరూ తడిసి ముద్దయినయ్.

తలమీదనుంచి జారిన వర్షపుచినుకులు ముత్యాల్లా మెరుస్తూ ముఖంమీదపడి నలిగిపోతున్నయ్.

ఎవరోవచ్చి కొట్లో మందులు కొంటున్నారు. కొన్ని మందులు వాళ్ళముందు పెట్టివున్నయ్.

మెరుపులాంటి ఆలోచన రామిగాడి పసిహృదయంలో తళుక్కుమంది.

మెల్లగా మందులకొట్టు మెట్లెక్కేడు.

అటూ యిటూ ఒక క్షణంపాటుచూచి చేతికి అందిన మందుసీసా ఒకటి చేతిలో చిక్కించుకుని గిర్రున వెనక్కు తిరిగి పరుగెత్తాడు.

"దొంగ...దొంగ..." అనే కేకలు.

చేతిలోవున్న మందు సీసాను మరింత గట్టిగా గుప్పిళ్ళ మధ్య బిగించి పరుగెడుతూనే వున్నాడు వెనక్కి తిరిగి చూడకుండా.

"పట్టుకోండి ... పట్టుకోండి" అంటూ మనుష్యులు తరుముతున్నారు.

రామిగాడి గుండె, పెదాలు చలిలోనూ, భయంతోనూ వణుకుతున్నాయి.

పరుగెడుతున్న రామిగాడు సందు మలుపులో కాలు జారి, గాలివానకు రోడ్డుకు అడ్డంగా పడిపోయిన కరెంటు స్తంభంమీద వాలిపోయాడు.

"ఆగండాగండి...అతడ్ని పట్టుకోకండి. దూరంగానే వుండండి" చుట్టూ చేరినవాళ్ళు రకరకాలుగా అంటున్నారు.

కరెంటు తీగెలు చుట్టుకు పోవటంతో క్షణాల్లోనే రామిగాడు నల్లబడి కొయ్యబారిపోయాడు.

రామిగాడి గుండెలకింద మందుసీసా పగిలి ముక్కలైంది.

లచ్చికి రెండో ప్రాణం దూరమైంది.

10]